సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 24 । మార్చి । 2023



కిలో టమాట రూ.20
అనంతపురం శివార కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.4.50, సరాసరిన రూ.7 ప్రకారం అమ్మకాలు జరిగాయి.



జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.



ముక్క నమిలేస్తున్నారు..

ఉమ్మడి అనంత జిల్లాలో మటన్ ఉత్పత్తి ఏటేటా పెరుగుతోంది. చిత్తూరు మినహా రాయలసీమలోనే అత్యధికంగా మన జిల్లాల్లోనే మటన్ వినియోగం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ధర చుక్కలనంటుతున్నా ప్రజలు చికెన్ కంటే మటన్ వైపే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. రంజాన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది.



మ'టన్నుల' కొద్దీ వినియోగం..
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన మేక, గొర్రె మాంసం ఉత్పత్తి
- చిత్తూరు మినహా రాయలసీమలో అత్యధికంగా ఇక్కడే వినియోగం
- నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం
- వినియోగం మరింత పెరిగే అవకాశం



రాయలసీమ జిల్లాల్లో మటన్ ఉత్పత్తి ఇలా (మెట్రిక్ టన్నుల్లో)	
జిల్లా	ఉత్పత్తి
కర్నూలు	27.72
నంద్యాల	28.93
అనంతపురం	33.42
సత్యసాయి	36.78
వైఎస్సార్	22.34
అన్నమయ్య	29.37
చిత్తూరు	42.00
తిరుపతి	26.31

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మేకలు, గొర్రెల మాంసం (మటన్) ఉత్పత్తిలో ఇటు అనంతపురం, అటు శ్రీ సత్యసాయి జిల్లాలు పోటాపోటీగా ఉన్నాయి. వినియోగంలోనూ ఉభయ జిల్లాలవాసులు పోటీ పడుతున్నారు. చాలాకాలం నుంచే రాష్ట్రంలోనే అత్యధికంగా అనంతపురం జిల్లాలో గొర్రెలు, మేకల పెంపకం ఉంది. ఈ క్రమంలోనే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉమ్మడి జిల్లాలో 55 మెట్రిక్ టన్నులకు పైగా మటన్ ఉత్పత్తి జరిగినట్లు ఒక పరిశీలనలో తేలింది.

చికెన్ కంటే మటన్ ప్రియులే ఎక్కువ

చికెన్ కంటే మటన్‌తో భోజనం చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. మటన్ రేటు కిలో రూ. 800 చేరుకున్నా జనం దానివైపే మొగ్గు చూపుతున్నారు. వందలో 50 శాతం మంది నెలలో రెండు సార్లు మటన్ తింటున్నట్టు తేలింది. పల్లెటూళ్లలోనూ మటన్ వినియోగం తక్కువేమీ కాదు. జాతరలు, తిరునాళ్ల సందర్భంలో మిత్రులు, బంధువులతో కలిసి మటన్ ముక్క నమిలేస్తున్నారు.

రంజాన్‌లో మరింత ఎక్కువ..

రంజాన్ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. రెండు జిల్లాల్లోనూ ముస్లింలు ఎక్కువగా ఉన్నారు. రంజాన్ మాసంలో తయారయ్యే హలీం ముస్లింలకే కాకుండా మిగతా వర్గాల వారికి కూడా బాగా నచ్చుతుంది. దీంతో గొర్రెలు, పొట్టేళ్ల మాంసం వినియోగం భారీగా పెరిగే అవకాశం ఉంది. అన్ని పట్టణ ప్రాంతాల్లోనూ మటన్ హలీం ప్రత్యేక ఆకర్షణ అవుతుంది.

బెంగళూరుకు ఎగుమతి..

శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరుకు ఎక్కువగా మటన్ ఎగుమతి అవుతోంది. రోజూ లారీల కొద్దీ గొర్రెలు, మేకలు అక్కడికి వెళుతున్నాయి. దీంతో పాటు ఇక్కడ నుంచి భారీగా కోడిగుడ్లు కర్ణాటక రాజధాని వెళ్తున్నాయి. ఇక.. రెండు జిల్లాల్లోనూ గుడ్ల వినియోగం కూడా బాగా పెరిగినట్టు తేలింది. పాల ఉత్పత్తి గతంలో గరిష్టంగా 250 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ ఉండేది కాదు. శ్రీ సత్యసాయిలో ఈ ఏడాది ఏకంగా 404 మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి జరగడం గమనార్హం.



రెండు జిల్లాల్లో గతేడాది పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి ఇలా..

కేటగిరీ	పరిమాణం
అనంతపురం జిల్లాలో	
పాలు	305.52 మెట్రిక్ టన్నులు
మటన్	33.423 మెట్రిక్ టన్నులు
గుడ్లు	731.71 లక్షలు
శ్రీ సత్యసాయి జిల్లాలో	
పాలు	404.04 మెట్రిక్ టన్నులు
మటన్	36.784 మెట్రిక్ టన్నులు
గుడ్లు	742.46 లక్షలు

అనంతకు అగ్రాసనం!

రాయితీ విత్తుకు జగన్ సర్కారు గ్రీన్‌సిగ్నల్
- 2.28 లక్షల క్వింటాళ్ల పంపిణీకి ప్రణాళిక
- అత్యధికంగా 'అనంత'కు 1,17,059 క్వింటాళ్లు
- శ్రీసత్యసాయికి 1,11,230 క్వింటాళ్లు



విత్తన వేరుశనగ

2023-24 విత్తన ప్రణాళిక ఇలా..		
విత్తన రకం	అనంతపురం	శ్రీ సత్యసాయి
విత్తన వేరుశనగ	85,044 క్వింటాళ్లు	1,09,131 క్వింటాళ్లు
పప్పుశనగ	24,700 ,,	1,350 ,,
వరి	1,500 ,,	500 ,,
కంది	4,300 ,,	--
రాగి	04 ,,	60 ,,
కొర్ర	58 ,,	--
మినుము	54 ,,	--
పెసర	172 ,,	55 ,,
ఉలవ	1,025 ,,	--
జీలుగ విత్తనాలు	117 ,,	34 ,,
పిల్లిపెసర	85 ,,	--


అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. మే నుంచి ప్రారంభం కానున్న వ్యవసాయ సీజన్‌కు రైతులకు అవసరమైన విత్తనాలు రాయితీతో ఇవ్వడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో విత్తన పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. 2023–24 సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలో 2,28,289 క్వింటాళ్లు పంపిణీ చేయనుండగా, ప్రధానపంట వేరుశగన జిల్లాకు 85,044 క్వింటాళ్లు, శ్రీ సత్యసాయి జిల్లాకు 1,09,131 క్వింటాళ్లు కేటాయించారు. 2023 సంవత్సరాన్ని 'ఇంటర్నేషనల్ మిల్లెట్స్ (చిరుధాన్యాలు) ఇయర్'గా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నేపథ్యంలో చాలా దేశాల్లో కనుమరుగవుతున్న సంప్రదాయ పంటల సాగుకు చర్యలు తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విత్తన వేరుశనగ, పప్పుశనగతో పాటు ఈ సారి కొన్ని రకాల చిరుధాన్యపు పంటలను ప్రోత్సహించేలా పంపిణీ జాబితాలో చేర్చారు.

నాణ్యమైన విత్తనాలే పంపిణీ...

ఏపీ సీడ్స్, మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయీస్ లాంటి ప్రభుత్వ రంగ నోడల్ ఏజెన్సీల సహకారంతో సకాలంలో నాణ్యమైన విత్తనాలు తెప్పించి ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో 26 జిల్లాలకు కలిపి మొత్తంగా 9,14,965 క్వింటాళ్లు రాయితీ విత్తనం కేటాయించగా, అందులో అత్యధికంగా మొదటి స్థానంలో అనంతపురం 1,17,059 క్వింటాళ్లు, రెండో స్థానంలో శ్రీ సత్యసాయి జిల్లా 1,11,230 క్వింటాళ్లకు అనుమతిచ్చారు. లక్షకు పైగా ఉన్నవి ఈ రెండు జిల్లాలే కావడం విశేషం. 62 వేల క్వింటాళ్లతో మూడో స్థానంలో వైఎస్సార్ జిల్లా ఉండగా, 61 వేల క్వింటాళ్లతో విజయనగరం, 55 వేల క్వింటాళ్లతో శ్రీకాకుళం, 52 వేల క్వింటాళ్లతో అన్నమయ్య జిల్లా ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులకు వైఎస్ జగన్ సర్కారు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం గమనార్హం. చిరుధాన్యాల పంటల సాగు విస్తరించే క్రమంలో రాగి, కొర్ర, జొన్న, మొక్కజొన్న లాంటి విత్తనాల కేటాయింపు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని డీఏఓ బి.చంద్రానాయక్ తెలిపారు.

నేటి నుంచి రంజాన్ మాసం

- ఉపవాస దీక్షలు పాటించనున్న ముస్లింలు
- ముస్తాబైన మసీదులు



అనంతపురం జిల్లా కేంద్రంలో నెలవంక కనిపిస్తున్న దృశ్యం

ఎన్పీకుంట: ముస్లింల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. గురువారం రాత్రి నెలవంక కనిపించడంతో ముస్లింలు ఉపవాసదీక్షలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జిల్లాలో మసీదులు విద్యుద్దీపాలంకరణలతో పండుగ శోభ సంతరించుకున్నాయి.

ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో పాటించాల్సిన ఐదు సూత్రాలు

1.కల్మా: (లా ఇలాహ ఇల్లల్లాహ్ మొహమ్మదర్రసూలుల్లాహ్ అల్లాహ్ గొప్పవాడు ఆయన ఒక్కడే ఆరాధ్యానికి అర్హుడు అని దీని అర్థం).

2.నమాజు చదవడం, ప్రతి ముస్లిం రోజుకు ఐదు పూటల నమాజును తప్పకుండా ఆచరించాల్సి ఉంటుంది.

3. రోజా పాటించడం, రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆ మాసం మొత్తం ఉపవాసాలను ఉండి అల్లాహ్‌ను స్మరించుకోవాలి.

4: డబ్బున్న ముస్లింలకు మాత్రమే ఇది వర్తిస్తుంది. వాటిలో జకాత్ అందించడం. ఆదాయంలో 25 శాతం భాగాన్ని పేదలకు పంచాలి.

5. చిట్టచివరిది హజ్. స్థోమత కలిగిన ప్రతి ముస్లిం తప్పనిసరిగా హజ్ పాటించాలి.

నెలవంక చూసి..


ముస్లింలు నెలవంకను చూసి ఉపవాసాలను ప్రారంభిస్తారు. 30 రోజుల పాటు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసాన్ని పాటించి కఠోర దీక్షతో అల్లాహ్ ప్రార్థిస్తారు. తరువాతి మాసం షవ్వాల్‌లో నెలవంకను చూసి ఉపవాసాలను విరమిస్తారు. షవ్వాల్ తొలి రోజును రంజాన్‌గా ముస్లింలు పాటిస్తారు.

ఇఫ్తార్ ప్రత్యేకత..

రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాదీక్ష విరమింపచేసే కార్యక్రమాన్ని ఇఫ్తార్ అంటారు. ఇఫ్తార్ సమయంలో తీసుకునే ఆహారాన్ని దీక్షవాసులకు అందించడం కూడా పుణ్యకార్యంగా భావిస్తారు. రంజాన్ మాసమంతా ఉపవాస దీక్షపరులకు విరివిగా ఇఫ్తార్ విందు ఇస్తారు.

తరావీహ్ నమాజ్..

ముస్లింలు రోజూ 5 సార్లు నమాజు (ఉదయం ఫజర్, మధ్యాహ్నం జోహర్, సాయంత్రం 5 గంటలకు అసర్, 6.30 గంటలకు మగ్‌రిబ్, రాత్రి 8 గంటలకు ఇషా నమాజ్) చేస్తారు. రంజాన్‌లో ఇషా నమాజ్ తర్వాత ప్రత్యేకంగా ఎంతో నిష్ఠతో మరో 20 రకాత్‌లు తరావీహ్ నమాజ్ చేస్తారు. రంజాన్ మాసంలో తరావీహ్ నమాజ్‌కు అత్యంత్ర ప్రాముఖ్యం ఉంటుంది.



మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు (ఫైల్)

గుత్తి - పెండేకల్లు డబ్లింగ్‌కు గ్రీన్‌సిగ్నల్

- 29.2 కిమీలకు రూ.351 కోట్ల మంజూరు
- డీఆర్ఎం వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న డీఆర్ఎం, ఇతర అధికారులు

గుంతకల్లు: గుత్తి–పెండేకల్లు రైలు మార్గం డబ్లింగ్‌కు రైల్వే మంత్రిత్వశాఖ నుంచి అనుమతులు లభించినట్లు డీఆర్ఎం కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం తన కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంతకల్లు–గుంటూరు డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా గుంటూరు–పెండేకల్లు–గుంతకల్లు సెక్షన్‌లో ఇదివరకే పనులు కూడా జరుగుతున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న గుత్తి–పెండేకల్లు రైలు మార్గం దక్షిణ ప్రాంతాల మధ్య (బెంగుళూరు–హైదరాబాద్) రైళ్ల నడపడానికి కీలకం కావడంతో 29.2 కి.మీల డబ్లింగ్ పనులు చేపట్టేందుకు రూ.351.8 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేశారన్నారు. ప్రాజెక్టులు పూర్తి అయితే గుంతకల్లు– పెండేకల్లు, గుత్తి–పెండేకల్లు మధ్య రైళ్ల రాకపోకలు సజావుగా సాగుతున్నారు. మరిన్ని రైళ్ల ప్రవేశపెట్టడానికి అవకాశం ఉందన్నారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా పలు ప్యాసింజర్ రైళ్ల ఆలస్యంగా నడుస్తున్నాయని, ఏప్రిల్ 1 నాటికి చాలా వరకు అభివృద్ధి పనులు చేసి సకాలంలో నడిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ధర్మవరం ఎల్‌సీ గేట్ తొలగింపునకు ప్రతిపాదన

గుంతకల్లు–కల్లూరు మార్గంలో పట్టణంలోని ధర్మవరం లెవల్ క్రాసింగ్ గేట్ తొలిగించి ఆర్‌యూబీ (రైల్ అండర్ బ్రిడ్జి) నిర్మాణానికి నివేదికలు తయారు చేసి జోనల్ అధికారులకు పంపినట్లు డీఆర్ఎం తెలిపారు. స్కూల్ బస్సులు, అంబులెన్స్‌లు వంటి వాహనాలు రాకపోకలు సాగించేలా ఇన్, అవుట్ మార్గాలతో డిజైన్ చేసినట్లు వివరించారు. మల్లప్పగేట్–గుంతకల్లు సేఫ్టస్ ఔటర్‌కు జరుగుతున్న బైపాస్ లైన్ పనులు జూలైకు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. అత్యంత మేజర్ ప్రాజెక్ట్ ప్లాట్‌ఫాంల అనుసంధాన పనులపై జోనల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గుంతకల్లు జంక్షన్‌లోని 1,2 ప్లాట్‌ఫాంలను ఇతర ప్లాట్‌ఫారంలకు అనుసంధానించే పనులను వచ్చే ఏడాది ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గుంతకల్లు జంక్షన్ ముగింట ఉన్న కోచ్ రెస్టారెంట్‌కు వచ్చే వారంలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

రామగిరిలో స్కిల్ సెంటర్ ఏర్పాటు

- నిరుద్యోగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



పెనుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా నిర్వహించనున్న ప్రభుత్వ యువజన ట్రైనింగ్ సెంటర్ రామగిరిలో ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్‌ఖయూమ్, జాబ్స్ కోఆర్డినేటర్ లక్ష్మి తెలిపారు. వీఎల్ ఎస్ ఎల్ డిజైన్ ఇంజినీర్ , ఎంబీడెడ్ ప్రోడక్ట్ డిజైనర్, ఇంజినీర్ టెక్నికల్ లీడ్‌కోర్సులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. బీటెక్‌లో ఈసీఈ, ఈఈఈ పాసైన ఆసక్తి కలిగిన యువతీ, యువకులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 7989479371కు గాని లేక వైటీసీ సెంటర్, రామగిరిలో నేరుగా సంప్రదించాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టన్ను చీనీ రూ.30 వేలు



అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేల ధర పలికాయి. మార్కెట్‌కు 82 టన్నులు అమ్మకానికి రాగా వాటిని ఈ–నామ్ పద్ధతిలో వేలం వేశారు. అందులో టన్ను గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టంగా రూ.15 వేలు, సరాసరిన రూ.22 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు.

ఆత్మవిశ్వాసానికి అంగవైకల్యం అడ్డురాదు



మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

హిందూపురం: ఆత్మవిశ్వాసం, పట్టుదలతో కృషిచేస్తే ఏదైనా సాధించవచ్చని అందుకు అంగవైకల్యం అడ్డురాదని డీఈఓ మీనాక్షి అన్నారు. గురువారం హిందూపురంలోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఉచిత ఉపకరణల పంపిణీ కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, ఎంఈఓ గంగప్ప, ఆర్థోసర్జన్ డేవిడ్‌రాజు, ఆడియాలజిస్ట్ కృష్ణవేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రోత్సాహం, సహకారం అందిస్తే దివ్యాంగులు కూడా అన్ని రంగాల్లో రాణిస్తారని పేర్కొన్నారు. దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ దివ్యాంగులపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, కౌన్సిలర్ రమేష్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి మల్లికాబేగం, స్కూల్ హెచ్‌ఎం సామ్రాజ్యం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రియ' అడ్మిషన్లకు నోటిఫికేషన్



అనంతపురం: కేంద్రియ విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. మార్చి 27 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 17 దరఖాస్తుకు తుది గడువు. ఒకటో తరగతి అడ్మిషన్ పొందడానికి ఆరు సంవత్సరాలు నిండి ఉండాలి. వయస్సు నిర్ధారణకు మార్చి 31, 2023ను ప్రామాణికంగా తీసుకుంటారు. రెండో తరగతిలో అడ్మిషన్లకు ఏప్రిల్ 3 నుంచి 12లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ అడ్మిషన్లకు అప్పటికే ఖాళీ అయిన సీట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుని భర్తీ చేస్తారు. ఇది వరకు సిఫార్సు సీట్లు అందుబాటులో ఉండగా, తాజాగా వాటిని రద్దు చేశారు.

రీసర్వే పనులు పూర్తి చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: మొదటి విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే చేసి సరిహద్దు రాళ్లు నాటే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. గురువారం సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లా నుంచి కలెక్టర్ బసంత్‌కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రెటరీ మాట్లాడుతూ రీసర్వేలో నాణ్యతా ప్రమాణాల తనిఖీ, ఫైనల్ ఆర్ఓఆర్, డ్రోన్ ఫ్లయింగ్ తదితర పనులను వేగవంతం చేయాలన్నారు. సరి హద్దు రాళ్లు నాటే కార్యక్రమాన్ని త్వరగా చేపట్టాలని ఆదేశించారు. బౌండరీ కన్ఫర్మేషన్, ఏరియా వ్యాలిడేషన్, తదితర పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ బసంత్ మాట్లాడుతూ రీ సర్వే పనులను సకాలంలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. డ్రోన్ ఫ్లయింగ్, హద్దు రాళ్లు నాటే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఏడీని ఆదేశించారు.

లక్ష్యాలు సాధించేలా కృషి..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన, స్కూల్ ఎడ్యుకేషన్, స్త్రీ శిశు సంక్షేమశాఖ, గ్రామ, వార్డు సచివాలయాలు, స్పందన, గడప గడపకూ మన ప్రభుత్వం తదితర పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో చీఫ్ సెక్రెటరీ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం పుట్టపర్తి కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు, సలహాలిచ్చారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ముఖ్యమైన 8 అభివృద్ధి సూచికల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు కృషి చేయాలన్నారు. అనీమియా నివారణ చర్యలు ముమ్మరం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో అనీమియ బాధితులను గుర్తించి అవసరమైన మందులను అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, విద్యాశాఖ అధికారి మధుసూధన్, వైద్యాధికారి కుళ్లాయప్పనాయక్ తదితరులు ఉన్నారు.

ముగిసిన 'యువసంకల్ప పర్తియాత్ర'



పనిముట్లను అందజేస్తున్న రత్నాకరరాజు

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో యూత్ సభ్యులు చేపట్టిన మూడ్రోజుల 'సాయి యువసంకల్ప పర్తియాత్ర' గురువారం అట్టహాసంగా ముగిసింది. సాయికుల్వంత్‌లోని సభామందిరంలో నిర్వహించిన ముగింపు వేడుకలను వేదపఠనంతో మొదలు పెట్టారు. కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు ఉపాధి శిక్షణ పొందిన యువతకు పనిముట్లను, కుట్టు మిషన్లను అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకరరాజు, ఆయన సతీమణి హిమవాహిని పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో 721 మంది గైర్హాజరు

రాప్తాడు రూరల్: ఇంటర్మీడియేట్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన మొదటి సంవత్సరం గణితం 1బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 721 మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 22,930 మందికి గాను 22,390 మంది, ఒకేషనల్ విద్యార్థులు 3,127 మందికి గాను 2,946 మంది హాజరయ్యారు. అధికారులు వివిధ కేంద్రాలను పరిశీలించారు.

క్లుప్తంగా

టూవీలర్ మెకానిజంలో శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు టూవీలర్(బైక్ రిపేరీ) కోర్సులో నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 45 రోజుల పాటు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో టూవీలర్ మెకానిజంలో శిక్షణ ఇవ్వడంతో పాటు కస్టమర్లతో వ్యవహరించే తీరు, ఇంగ్లిష్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంలోనూ తీర్చిదిద్దుతామన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. ఈ నెల 6వ తేది నూతన బ్యాచ్ ప్రారంభిస్తున్నామన్నారు. అభ్యర్థులకు మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తామని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి టూల్‌కిట్, సర్టిఫికెట్ అందజేస్తామని వెల్లడించారు. వివరాలకు 9390505952, 7780752418 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు, రేపు

జాతీయ సెమినార్

రాప్తాడు రూరల్: ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా అనంతపురం ఆర్ట్స్ కళాశాల వాణిజ్య - నిర్వహణ విభాగం అధ్వర్యంలో 'భారతదేశంలో డిజిటల్, విధ్వంసక సాంకేతికతలు-పోకడలు, సవాళ్లు, అవకాశాలు' అనే అంశాలపై శుక్ర, శనివారం రెండు రోజుల పాటు జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నారు. ఇండియన్ కౌన్సిల్ అఫ్ సోషల్ సైన్సు రీసెర్చ్ వారి సౌజన్యంతో ఈ సెమినార్ జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులతో సహా వివిధ రంగాల మేధావులు పాల్గొంటారన్నారు.

'యువగళం'... గందరగోళం!

- పాదయాత్రలో పాల్గొనేందుకు మొగ్గు చూపని తమ్ముళ్లు
- డబ్బు, మద్యం ఎరగా చూపి తరలిస్తున్న నాయకులు
- రూ.వెయ్యి చెప్పి రూ.500 ఇస్తావా అంటూ గొడవ
- పుట్టపర్తిలో పల్లెను పక్కకు నెట్టేసిన సెక్యూరిటీ


డబ్బులు సరిగా ఇవ్వడం లేదంటూ గొడవ పడుతున్న 'తమ్ముళ్లు'

సాక్షి, పుట్టపర్తి: ప్రజాక్షేత్రంలో పట్టు సాధించాలనే లక్ష్యంతో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' కాస్త నేతల మధ్య గందరగోళానికి తెరలేపింది. క్వార్టర్ బాటిల్ మద్యం, లీటర్ పెట్రోల్, ఖర్చులకు నగదు ఇస్తే కానీ పాదయాత్రలో పాల్గొనేందుకు కార్యకర్తలు ముందుకు రావడం లేదు. ఈ విషయాలన్నీ వీడియోలు, ఫొటోల రూపంలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో టీడీపీ నేతలు స్వీయ రక్షణలో పడ్డారు.

'పల్లె'కు చెక్ పెట్టాలనే..

యువగళం పాదయాత్ర రెండు రోజుల క్రితం పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రవేశించింది. అప్పటి నుంచి నారా లోకేష్ ఎదుట తన సత్తా చాటేందుకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పల్లె రఘునాథరెడ్డి నానాపాట్లు పడుతున్నారు. అయితే పల్లెకు వ్యతిరేకవర్గంగా ఉన్న పెదరాసు సుబ్రహ్మణ్యం, పీసీ గంగన్న, వడ్డే వెంకట్ తదితరులు నియోజకవర్గంలో యువగళం ఎంట్రీ అయిన రోజునే చినబాబుతో కలసి ఇంత కాలం పల్లె వ్యవహరించిన తీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ సారి ఎన్నికల్లో పల్లె రఘునాథరెడ్డికి టికెట్ ఇస్తే పార్టీ కేడర్ నుంచి ఎలాంటి సహాయ, సహకారాలు ఉండవని స్పష్టం చేసినట్లు సమాచారం.

డబ్బు, మద్యం ఎరగా వేసి..

'యువగళం'లో పాల్గొనేందుకు యువత ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో పుట్టపర్తిలో తన బలం నిరూపించుకునేందుకు పల్లె రఘునాథరెడ్డి పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. అదే సమయంలో చినబాబు వద్ద మంచి మార్కులు సాధించి ఎమ్మెల్యే టికెట్ ఖరారు చేసుకుందామనే ఆలోచనలో ఉన్న వారి పరిస్థితి మరీ దారుణంగా మారింది. పాదయాత్రలో పాల్గొనేందుకు ఎవరికి వారు రూ.500 నగదుతో పాటు లీటర్ పెట్రోల్, క్వార్టర్ మద్యం బాటిల్ అందజేస్తున్నారు. ఈ క్రమంలో పుట్టపర్తిలోని పెట్రోల్ బంకులు, మద్యం షాపుల వద్ద తెలుగు తమ్ముళ్లు సాగించిన సందడి కాస్త వీడియోలు, ఫొటోల రూపంలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీనికి తోడు తన సత్తా చాటుకునే క్రమంలో పాదయాత్రకు భారీ ఎత్తున జనాన్ని తరలించేందుకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున ఇవ్వాలంటూ తన అనుచరులకు పల్లె రఘునాథరెడ్డి పురమాయించినట్లు సమాచారం. అయితే రూ.500 మాత్రమే ఇస్తుండడంతో పలువురు కార్యకర్తలు పల్లె అనుచరులను నిలదీస్తున్న అంశాలు సైతం సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

పల్లెను నెట్టేసిన సెక్యూరిటీ..

'యువగళం'లో నారా లోకేష్‌ను కలిసేందుకు వెళ్లిన పల్లె రఘునాథరెడ్డికి ఘోర అవమానం ఎదురైంది. పాదయాత్రలో ముందుకు సాగిపోతున్న లోకేష్‌తో చేయి కలిపేందుకు ప్రయత్నించిన పల్లె రఘునాథరెడ్డి చర్యలను సెక్యూరిటీ అడ్డుకుని, పక్కకు నెట్టేశారు. ఆ సమయంలో కిందపడిబోతున్న పల్లెను మరికొందరు పట్టుకున్నారు. ఈ దృశ్యాలు రెండు రోజులుగా నెట్టింట వైరల్ అవుతోంది.

పుట్టపర్తిని మరిచిన లోకేష్..

ఉగాది పండుగ సందర్భంగా పాదయాత్రకు మూడు రోజులు బ్రేక్ ఇచ్చిన లోకేష్... పక్కనే ఉన్న సత్యసాయిబాబా మహాసమాధిని కూడా సందర్శించక పోవడం నియోజకవర్గ ప్రజల మనోభావాలను దెబ్బతీసింది. దీనిపై సొంత పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న 'రాగి జావ' కార్యక్రమానికి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆర్థిక సహకారం అందించడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు.

పరస్పరం ఢీకొన్న కార్లు

పుట్టపర్తి: బుక్కపట్నం-పుట్టపర్తి ప్రధాన రహదారిపై గురువారం రెండు కార్లు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం మీదుగా బెంగళూరుకు వెళుతున్న రమేష్... జానకంపల్లి సమీపంలోకి చేరుకోగానే పుట్టపర్తి నుంచి బుక్కపట్నం వైపు వస్తున్న పుట్టపర్తి మున్సిపాలిటీ మేనేజర్ ఆరీఫ్ కారును ఢీకొన్నాడు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రెండు కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. ఘటనలో ఆరీఫ్‌తో పాటు ఆయన కారు డ్రైవర్ నరసింహమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన రమేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బుక్కపట్నం ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.

చికెన్ తెస్తానంటూ వెళ్లి...


మృతుడు చంద్రయ్య

బత్తలపల్లి: కుటుంబ సభ్యులతో కలసి ఉగాది పండుగను సంతోషంగా జరుపుకున్న వ్యక్తి... ఆ మర్నాడు చేసుకునే మాంసాహార విందుకు చికెన్ తీసుకువస్తానంటూ వెళ్లి తిరిగి రాని లోకానికి పయనమైపోయాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలం గంటాపురం నివాసి మల్లెపూల చంద్రయ్య (51)కు భార్య ఉమాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. బత్తలపల్లిలోని ఓ హోటల్‌లో వంటవాడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పండుగ మర్నాడు గ్రామీణులు ఎంతో ఉత్సాహంతో జరుపుకునే పార్నం వేడుకను ఇంటిల్లిపాది సంతోషంగా జరుపుకునేందుకు సిద్ధమైన చంద్రయ్య.. గురువారం ఉదయం చికెన్ తీసుకువస్తానంటూ ద్విచక్ర వాహనంపై బత్తలపల్లికి బయలుదేరాడు. చికెన్ కొనుగోలు చేసి తిరుగు ప్రయాణమైన ఆయన.. గ్రామ శివారులోకి చేరుకోగానే ద్విచక్ర వాహనం రోడ్డుపై జారింది. దీంతో అదుపు తప్పి కింద పడిన చంద్రయ్య తీవ్రంగా గాయపడ్డాడు. విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. 'చికెన్ తీసుకొచ్చేకెళ్లి పరలోకాలకు ఏళ్తివా' అంటూ కుటుంబసభ్యులు రోదించిన తీరు చూపరులను కలిచి వేసింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

జిల్లా జైలుకు 'శ్రీధరన్' ముఠా సభ్యులు

- ముగిసిన పోలీసు కస్టడీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: హవాలా డబ్బు దోపిడీ సాగించే కేరళ నివాసి శ్రీధరన్ ముఠా సభ్యుల పోలీస్ కస్టడీ ముగిసింది. దీంతో న్యాయమూర్తి ఆదేశాలతో అనంతపురం జిల్లా జైలుకు గురువారం నిందితులను తరలించారు. రాప్తాడు సమీపంలోని హంపాపురం జాతీయ రహదారిపై ఇటీవల హవాలా డబ్బును దోపిడీ చేసిన కేసులో ఇప్పటికే పట్టుబడిన నలుగురిని పోలీసులు జ్యుడీషియల్ కస్టడీకి తరలించిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నాలుగు రోజుల క్రితం నిందితులను పోలీస్ కస్టడీకి తీసుకుని, వివిధ ప్రాంతాల్లో వారు దోపిడీకి పాల్పడిన తీరును పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ క్రమంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ ప్రాంతాల్లో ముఠా కార్యకలాపాలు కొనసాగించిన ప్రాంతాల్లో పోలీసు దర్యాప్తు బృందం పర్యటించింది. అదుపులో ఉన్న నిందితుల నుంచి కీలక సమాచారాన్ని రాబట్టింది. ఈ దోపిడీలో మొత్తం 14 మంది పాల్గొన్నట్లు గుర్తించి, పరారీలో ఉన్న వారి కోసం గాలింపు వేగవంతం చేశారు. కాగా, కేరళలోని ఏడు జిల్లాలో నిందితుల కోసం గాలించిన అనంత పోలీసులకు ఆ రాష్ట్ర పోలీసుల నుంచి ఆశించిన సహకారం లభించలేదని తెలుస్తోంది. దీనికి తోడు హవాలా డబ్బు దోపిడీ సాగించే ప్రధాన రెండు ముఠాల మధ్య అంతర్గత పోరు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఈ కేసులో కీలక నిందితులను కప్పాయాక్ట్ (ఏపీలో పీడీ) కింద కేరళ పోలీసులు రిమాండ్‌కు పంపినట్లు సమాచారం. ఈ కేసును సవాలుగా తీసుకున్న జిల్లా పోలీసులు శ్రీధరన్ ఆట కట్టించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

కారు బోల్తా- ఒకరి మృతి


మృతి చెందిన అక్తర్ హుస్సేన్


ప్రమాదానికి గురైన కారు

కనగానపల్లి: కారు బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురానికి చెందిన అక్తర్ హుస్సేన్ (68), తన కుమార్తె మెహతాజ్‌బేగం, అల్లుడు అబ్దుల్ ముజబర్‌తో కలసి గురువారం మధ్యాహ్నం బెంగుళూరు నుంచి అనంతపురానికి కారులో బయలుదేరాడు. సాయంత్రం కనగానపల్లి మండలం దాదులూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా కారు ముందు చక్రం టైర్ బరెస్ట్ కావడంతో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురూ గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రులను ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో అక్తర్ హుస్సేన్ మృతి చెందాడు. ఘటనపై కనగానపల్లి ఎస్‌ఐ హనుమంతరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్ట్

- పరారీలో మరొకరు

ఆత్మకూరు: డబ్బు కోసం వ్యక్తిని హతమార్చేందుకు ప్రయత్నించిన కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఆత్మకూరు ఎస్‌ఐ రంగడు యాదవ్ గురువారం వెల్లడించారు. మండలంలోని పి.యాలేరు గ్రామానికి చెందిన గొల్ల తిమ్మరాజు ఈ నెల 15న తన పొలంలో వేరుశనగ పంటకు కాపలాకు వెళ్లాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన బోయ గణేష్, మరో ఐదుగురు అక్కడకు చేరుకుని తిమ్మరాజుపై హత్యాయత్నం చేశారు. ఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... గురువారం ఉదయం ఆత్మకూరు ధాబా వద్ద ఉన్న గణేష్‌తో పాటు కూడేరు మండలం ఎం.ఎం.హళ్లి నివాసి అక్కులన్న, నారాయణపురం నివాసి వెంకట్రాముడు, అనంతపురంలోని తపోవనానికి చెందిన చాకలి మధుసూదన్, కృష్ణంరెడ్డిపల్లి నివాసి వడ్డే చిరంజీవిని అదుపులోకి తీసుకుని బొలెరో వాహనం, దాడికి ఉపయోగించిన కట్టెలు, రాళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేవలం డబ్బు కోసమే తిమ్మరాజుపై హత్యాయత్నం చేసినట్లు నిందితులు అంగీకరించడంతో వారిని అరెస్ట్ చూపి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఉన్న మరో నిందితుడు కురుగుంట నివాసి శేఖర్ పరారీలో ఉన్నాడు.

మద్యం మానేయమంటే ఆత్మహత్య చేసుకున్నాడు


మృతుడు గోపీకృష్ణ

చిలమత్తూరు: మద్యం మానేయమని కుటుంబసభ్యులు హితవు చెప్పడాన్ని జీర్ణించుకోలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం పాత చామలపల్లికి చెందిన గోపీకృష్ణ (32)కు భార్యతో పాటు ఏడాది వయసున్న కుమారుడు, తల్లి ఉన్నారు. ఇటీవల చెడు అలవాట్లకు బానిసైన గోపీకృష్ణ పనీపాట చేయకుండా జులాయిగా తిరగసాగాడు. దీంతో కుటుంబ పోషణ భారమైంది. ఇదే విషయాన్ని బుధవారం కుటుంబసభ్యులు లేవనెత్తి గోపీకృష్ణను నిలదీశారు. మద్యం మానేసి కుటుంబ పోషణపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కుటుంబసభ్యులు మందలించడంతో మనస్తాపం చెందిన గోపీకృష్ణ బుధవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి తిప్పమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

29 మంది జూదరుల అరెస్ట్

మడకశిర(గుడిబండ): ఇస్పేటాకులు ఆడుతున్న 29 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గుడిబండ ఎస్‌ఐ మునిప్రతాప్ వెల్లడించారు. గుడిబండ సమీపంలోని తుమ్మల మారెమ్మ దేవాలయం వద్ద గురువారం పెద్ద ఎత్తున పేకాట జూదం నిర్వహిస్తున్నట్లుగా అందిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆ సమయంలో పోలీసుల రాకను గమనించి పలువురు పారిపోగా, సిబ్బంది వెంటాడి 29 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.78,200 నగదు, 27 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం జూదరులపై కేసు నమోదు చేశారు.

కోటకొండలో ముగిసిన తిరునాల


తిరునాలకు బండ్లపై తరలివస్తున్న భక్తులు

పెద్దవడుగూరు: మండలంలోని గోపురాజుపల్లి సమీపంలో వెలసిన కోటకొండ ఆంజనేయస్వామి తిరునాల గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఉగాదిని పురస్కరించుకుని తిరునాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గురువారం ఉదయం ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి.

రైలు ఢీకొని బాల కార్మికుడి దుర్మరణం

అనంతపురం సిటీ: రైలు ఢీకొన్న ఘటనలో ఓ బాల కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని సంజహవల్ ప్రేమ్‌నగర్‌కు చెందిన జకీర్ అలీ (13) అక్కడి కార్మికులతో కలసి అనంతపురానికి వలస వచ్చి పీఓపీ పనుల్లో పాలుపంచుకుంటున్నాడు. అనంతపురంలోని లక్ష్మీనగర్‌లో అద్దె గదిలో నివాసముంటున్న జకీర్ అలీ గురువారం ఉదయం 9 గంటలకు రహమత్ నగర్‌కు బయలుదేరాడు. చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటూ పట్టాలు దాటుతుండగా ధర్మవరం - మచిలీపట్నం వెళ్లే రైలు ఢీకొంది. విషయం తెలుసుకున్న జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి జేబులోని ఆధార్ కార్డు ఆధారంగా ఉత్తరప్రదేశ్‌లో ఉంటున్న కుటుంబసభ్యులకు సమాచారం అందించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ముద్దాయిలకు పదేళ్ల జైలు శిక్ష

కొత్తచెరువు: అదనపు కట్నం కోసం వివాహితను వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన భర్త, అతని తల్లికి పదేళ్ల జైలు శిక్ష పడింది. ఈ మేరకు ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మవరంలోని వైఎస్సార్ కాలనీకి ఎందిన రంగనాయకులు కుమార్తె రేణుక (26)కు 2008లో రామాంజినేయులుతో వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నకానుకలను భారీగానే రేణుక తల్లిదండ్రులు అందజేశారు. కొన్నేళ్ల వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం అదనపు కట్నం తేవాలంటూ భర్త రామాంజినేయులుతో పాటు అతని తల్లి వసుంధర తరచూ రేణుకను వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. వీరి వేధింపులు తాళలేక 2014లో రేణుక ఆత్మహత్య చేసుకుంది. ఘటనకు సంబంధించి ధర్మవరం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఎఎస్పీ అభిషేక్ మహంతి నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేసి, పక్కా ఆధారాలతో నిందితులు రామాంజినేయులు, వసుంధరను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసు వాదనల్లో భాగంగా 23 మంది సాక్షులను అనంతపురం 4వ ఏడీజే శోభారాణి విచారించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు పదేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున జరిమానా విధించారు. కేసులో వాదనలను స్పెషల్ ఏపీపీ సుజన వినిపించారు.

పవనపుత్రా.. పాహిమాం


వేలాదిమంది భక్తుల నడుమ సాగుతున్న రథోత్సవం
(ఇన్‌సెట్) సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురంలో నెట్టికంటి ఆంజనేయస్వామి రథోత్సవం గురువారం కనులపండువగా సాగింది. వేలాదిమంది భక్తులతో ఆలయ పురవీధులు పోటెత్తాయి. ఆంజనేయ రక్షమాం.. పవన పుత్ర పాహిమాం అంటూ భక్తులు స్వామివారి సేవలో తరించిపోయారు. గురువారం వేకువజామునే నెట్టికంటి ఆంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించిన అర్చక బృందం స్వామిని ప్రత్యేక పుష్పాలతో అందంగా తీర్చిదిద్ది దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయ ప్రధాన గోపురం ముందు రథం నిలిపి హోమం, బలిహరణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను రథంలో కొలువుదీర్చి పూజలు చేశారు. ఆలయ ఈఓ వెంకటేశ్వరరెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ కొబ్బరికాయ సమర్పించి రథోత్సవం ప్రారంభించారు. ఉత్సవంలో అడుగడుగునా భక్తులు స్వామివారికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయల్ అనిత, ఎంపీటీసీ జ్యోతి, మాజీ పాలకమండలి సభ్యులు త్యాగరాజు, గంతుల రామాంజనేయులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.